భాగవత పురాణంలో ఉన్న ఈ క్రింది కథ హోలీ పండుగ నాచరించడానికి మూలం. ఆ కథ —

“ రామరాజ్య అనంతరం హిరణ్యకశిపుడు అనే రాజు ఉండేవాడు. అతడు రాముడు దేవుడు కాడని — తానే భగవంతుడనని, ప్రజలందరు తననే పూజించాలని తన రాజ్యంలో అజ్ఞాపించాడు. కాని అతని కుమారుడు ప్రహ్లాదుడే రాముణ్ణి పూజిస్తూ తండ్రి యాజ్ఞను తిరస్కరించాడు. అది సహించలేక కుమారుని దండించ వలసిందిగా హిరణ్యకశిపు డాజ్ఞాపించాడు. రాముని నిజమైన దైవముగా అంగీక రించని ప్రహ్లాదుని సోదరి తన స్వశక్తి మీద ఆధారపడి ప్రహ్లాదునితోపాటు కాష్టం మీద కూర్చున్నది. అయితే ప్రహ్లాదుడు రక్షింపబడి హోలీ దహనమైపోయింది. ఈ విధంగా నిజమైన భగవంతుని మహిమా ప్రభావాన్ని కొనియాడడానికే ఈ హోలీ పండుగ నాచరిస్తారు.

మరో కథనం ప్రకారం పూర్వం బంజారుల్లో రామ అనే నాయకుడొకడు హోలీ పండుగ నిర్లక్ష్యముచేసినందున కడుపునొప్పితో బాధ పడ్డాడట. హోలీ నాచరించకపోయినచో తాముకూడ ఆ బాధకు గురి అగుదుమేమో అని భయంతో అప్పటినుండి బంజారులు హోలీ పండుగను తప్పక జరుపుకుంటున్నారు. పూర్వం బంజారులంతా హోలీ ఉత్సవం చేసుకొంటూ హోలీ బొమ్మను ఆహుతి చేసే సంబ రంలో వుండగా...రామనాయకుడు దేవుడు విగ్రహం దగ్గర నైవేద్యంగా పెట్టిన జొన్న అన్నాన్ని దొంగిలించుకొని వెళ్ళి తిన్నాడట. ఆకారణంగా కడుపునొప్పి రప్పించి భగవంతుడాతన్ని శిక్షించాడు. అప్పుడు రామనాయకుడు తన తప్పును తెలిసికొని పశ్చాత్తాపంతో క్షమించమని భగవంతుణ్ణి అడిగాడు. కాని భగవంతుడు ప్రతియేటా హోలీ పండుగరోజున జొన్న ధాన్యం—పరిసర గ్రామాలో యాచనచేసి మొత్తం తనకు కానుకగా యివ్వవలసిందనిచెప్పి అతని తప్పును క్షమించాడు. అందుకని భగవంతుడు తమపై ఆగ్రహించకుండా వుండాలని ప్రతి సంవత్సరం బంజారులు హోలీ పండుగ నాచరిస్తారు.

మరొక కథకూడ ప్రచారంలోవుంది—దశరథుని చిన్న కుమారుడైన శత్రు ఘ్నుడు ఒక ‘హోలీ’ అనే మహమ్మదీయ వనితతో అక్రమ సంబంధం పెట్టు కున్నాడు. ఆమె తల్లిదండ్రులైన హోరన్‌సాబ్, గోరీలు తమ బిడ్డ చేసే కార్యానికి అభ్యంతరం చెప్పలేదు. శత్రుఘ్నుడు వారి యింటిలో కాలు పెట్టేటప్పటికి వారి యింటిలో వున్న వస్తువులన్నీ బంగారంగా మారిపోయాయి. వారి యింటిని చూడటానికి వచ్చిన మహమ్మదీయులుకూడా ధనవంతులైనారు. ఈ కారణంగా మహమ్మదీయులెవరూ క్షత్రియుడైన శత్రుఘ్నునికి ఏ విధమయిన అపకారం, కీడు తలపెట్టలేదు. రామునికి సంగతి తెలిసి శత్రుఘ్నుని యింటికి తీసికొని రావలసిందిగా పెద్ద తమ్ముడైన లక్ష్మణుని నియోగించాడు. లక్ష్మణుడు వచ్చాడని తెలిసిన శత్రు ఘ్నుడు పారిపోయి ఓ బండలో దాక్కున్నాడు. హోలీ రోజూ భోజనం తెచ్చి పెట్టేది ఈ విషయాన్ని ఓ సన్యాసి సహాయంతో తెలిసికొనిన రాముడు అక్కడికి వచ్చి ఆ రాతిని చూస్తాడు లక్ష్మణుడేమో ‘కాసి వానిని’ (రాలు కొట్టే వానిని)

తీసికొనివచ్చి ఆ బండను పగులగొట్టమని చెప్పాడు. ఆ రాయిని పగులగొట్టిన తర్వాత శత్రుఘ్నుడు బయటకు వచ్చాడు...హోలీ ఒక నీచదేవత అని నిందించి శత్రుఘ్నుని వెంటతీసికొని వెళ్లాడు లక్ష్మణుడు. ఎప్పుడైతే శత్రుఘ్నుడు వెళ్ళి పోయాడో మహమ్మదీయుల యిళ్ళలో వున్న బంగారమంతా మట్టిగా మారి పోయింది. దానితో హిందువులు—మహమ్మదీయులు హోలీ అపవిత్రురాలని కోప గించి ఆమెను సజీవదహనం చేస్తారు.

హిందువులు ఆచరించే హోలీ విధానానికి పెద్దషాపూర్ బంజారులు ఆచ రించే హోలీపండుగ విధానానికి ఎంతో వ్యత్యాసముంది.

## (స్థానికులైన) హిందువుల హోలీపండుగ (Holy of the local people)

హోలీపండుగకు ముందు రోజు అనగా పౌర్ణమి రోజున స్థానికంగావున్న హిందువులు 'కాముడ్ని' దహించడానికి పెద్దకట్టెలరాసి నొకదానిని సిద్ధంచేస్తారు. శంకరునిలో కామోద్రేకాన్ని కలిగించిన మన్మథుని దహించిన విధానమును జ్ఞాపకంచేసికోడానికి ఈ దహన కార్యాన్ని నిర్వర్తిస్తారు. కనుకనే దీనిని కామ దహనం అని అంటారు. ఆ విగ్రహం తగుల బడటానికి అనుకూలంగా కొయ్యతో చేస్తారు. రాత్రిభోజనాలు అయిన వెంటనే గ్రామంలోని అందరు - కామదహనం చేయాలని నిర్ణయించిన స్థలానికి వూరేగింపుతో బయలుదేరతారు. ఈ వూరేగింపు గ్రామములోని యింటింటికివెళ్ళి వివిధరకాలైన క్రొత్తధాన్యాలను సేకరిస్తారు. వివిధరకాల ధాన్యాలనన్నిటిని కలిపి ఒక క్రొత్తకుండలో వుడికిస్తారు. అవి వుడి కేంతలో కాముడ్నిదహించడానికి కావలసిన కట్టెలుకూడా యింటింటికివెళ్ళి సేకరిస్తారు. మధ్యరాత్రికి అందరూ కామదహనం జరిగేస్థలానికి చేరుకున్న తర్వాత వారిలో వయోవృద్ధుడైన ఒకరు వండిన గుగ్గిళ్ళను అందరికీ పంచిపెడతాడు. వెంటనే వాటిలో కొన్నింటిని వారి తలపైన-యిళ్ళపైన చల్లుతారు. వృద్ధుడు కాముడ్ని వెలిగించినతర్వాత మిగిలిన గుగ్గిళ్ళను ఆ మంటలోనికి విసురుతారు. ఆ తర్వాత నోటివరకు చేతులెత్తి వింతైన శబ్దాలు వచ్చేవిధంగా చప్పట్లు కొడుతూ మంటచుట్టూ తిరుగుతారు. కాముడు కాలే సమయంలో యువకులంతా కోలాటం వేస్తారు. స్త్రీలంతా కలిసి వివిధరకాల పాటలు పాడుతూ బతకమ్మ ఆట ఆడతారు. ఈ బతకమ్మ నాట్యం కోస్తా ఆంధ్రజిల్లాలలో చేసే గొబ్బినాట్యం లాగున వుంటుంది. ఇక ముసలి, ముతకవారు భజనకీర్తనలు పాడతారు. ఈ విధంగా తొలికోడి కూసేంతవరకు గడుపుతారు. ఆతర్వాత అందరూ నిద్ర పోతారు. వేకువజామున ప్రతిఒక్కరూ దహనం అయిన బూడిదను దోసెడు తీసుకొని ఒక కుండలో పెట్టి యింటిలో వ్రేలాడకడతారు. ఇంటిలో ఎవరికైనా గాని, పశువులకుగాని జబ్బుచేస్తే ఆ కుటుంబ పెద్ద ఈ బూడిదను మంత్రగాని దగ్గరకు తీసుకొనివెళ్తే అతడు దానిని మంత్రించి తిరిగి యిస్తాడు. దానినే ఆ జబ్బుచేసిన వారికి మందుగా వాడతారు.

## బంజారుల హోలీ విధానం

హోలీపండుగ యింకా మూడు నాలుగు రోజులు వుందనగా బంజారుల ఆచారప్రకారం వివిధరకాల హాస్యగీతాలు పాడుతూ—నాట్యంచేస్తూ పరిసర గ్రామాలలో ధనం, ధాన్యం సేకరిస్తారు. సామాన్యముగా హోలీపండుగ నాహ్వానిస్తూ పాటలు పాడుతారు. ఆ పాటలలో నూతన సంవత్సరమును ఆహ్వానిస్తారు. ధనధాన్యాలు సేకరించునప్పుడు అలుపుసొలుపు అనుకోక స్త్రీ పురుషులంతా పాడూతూ నాట్యం చేస్తారు. ఎదురువచ్చిన వ్యక్తి తృణమో ఫణమో యిచ్చేటంతవరకూ వదలిపెట్టరు. స్త్రీలయితే దానం యిస్తాడు అనుకున్నవ్యక్తిచుట్టూ చుట్టుకొని అతడిచ్చేవరకు అతనికి దారి యివ్వక చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ నాట్యంచేస్తారు. ఇక దానితో నీటినుండి బయటపడిన చేపలాగున వారిని తప్పించుకోలేక తనకు తోచినదేదోయిచ్చి వారి సాధింపులనుండి బయట పడతాడు. ఈ విధంగా డబ్బు సేకరించేటప్పుడు పాటలు పాడుతూ నాట్యం చేస్తారు. పాట—నాట్యము, తాళములయందు కంటే సేకరించే డబ్బుపైనే వారు ఎక్కువ ధ్యానాన్నివుంచుతారు. హోలీపండుగకు ఖర్చుచేసే మొత్తాన్ని సంపాదించడానికి వారెంతదూరమైనా వెళతారు. ఈ విధంగా సంపాదించిన మొత్తాన్ని హోలీపండుగ వుత్సవాన్ని జరపడానికే వినియోగిస్తారు. పండుగకొరకు మేకపోతునుగాని, గొఱ్ఱెపోతునుగాని కొని ఉత్సవంలో దానిని వధించి దాని మాంసాన్ని అందరూ సమంగా పంచుకుంటారు. ఈ పశువధ పండుగనిమిత్తమేగాని దానికి మతపరంగా ఏవిధమైన ప్రాముఖ్యతలేదు.

హోలీ పండుగరోజు స్త్రీలంతా వేకువనేలేచి గోమయాన్ని—గోమేధాన్ని (పేడను—మూత్రాన్ని) సేకరిస్తారు. ఆవుపేడతో యిళ్ళను అలికి ఆవుమూత్రాన్ని యింటి పరికరాలపై చిలకరిస్తారు. గోమూత్రాన్ని పవిత్రంగా ఎంచి దానితో కొందరు పెద్దలు ముఖాలు కడుగుకొంటారు. ఆరోజు స్త్రీ పురుషులు అంతా శుభ్రమైన దుస్తులు ధరిస్తారు. క్రొత్తగా వివాహమైనవారు సహజంగా వారి ఆచారప్రకారం క్రొత్తగౌనులు, చోళీలు ధరిస్తారు. మగవారంతా కలసి సామూహికంగా మద్యపానం చేస్తూవుంటే స్త్రీలు కూడా యిళ్ళలో సారాయికాని కల్లుగాని త్రాగుతారు. సూర్యాస్తమయం తరువాత స్త్రీ పురుషులలో వుత్సాహోద్రేకాలను పెంపొందించుటకు డప్పును కొడుతూవుంటారు. తర్వాత హోలీ ఆడడానికి అందరూ తరలివస్తారు. బంజారులలో హోలీకి సాటియైన పండుగ మరొకటి లేదు. స్త్రీలంతా ఆచార ప్రకారం రంగురంగుల దుస్తులు, ఆభరణాలు ధరించి పండుగ అలంకరణ చేసికొంటారు. పండగముందు రోజులలో స్త్రీ పురుషులు వేరువేరుగా పాటలు పాడుతూ, నాట్యంచేస్తూ 'జోజెర' ఆచరిస్తారు. అసలు హోలీపండుగరోజు రాత్రి స్త్రీ పురుషులందరూ కలసి పాడుతూ నాట్యం చేస్తారు. స్త్రీలునాట్యంచేసేటప్పుడు పురుషులంతా చూస్తూ ఆనందిస్తారు. ఆ తర్వాత స్త్రీలు, గుండ్రంగా నిల్చొని తలపైన సగంవరకు చేతులెత్తి ఈ క్రింది హోలీపాటకు అనుగుణంగా నాట్యంచేస్తారు.

*1*. పాట:-

"ఎకిరె బోరుసుకు, బార బార, మిన,
బార బార మినమె హోయ్‌రే హోలీ,
జీవత్ తడనవథో, హోరకేలి హోలి,
నువ్వన కోట - జెమాయొ, రాస్టో భాయ్,
భాయ్‌రే హోలి.
హోలి - రమ్మెర్ల, భాయ్, భట్ - రే హోలి,
గంగా - కె పేట్‌మ ఝూద కైసొ - రో హోలి,
గంగా - కె పేటమ ఝూద. నారెలె - రో హోలి,
థోడె థోడె నార్ లి, దేవ్యూనే భేదొ - రే,
గంగ జబీనానే - భాయ్‌రే, భాయ్‌రే,
గంగాకె పేట్‌మె ఝూడె కైసొరో హోలి,
గంగాకె పేట్‌మె ఝూడె లింబీ - రే హోలి,
థోడె, థోడా, లింబీ - రే మాతన - భేజొరే, గంగ
జెబున భాయ్ - రే,
ఎకెరే, బురుసుకు, బార, మిన."

అంటే :-

"సంవత్సరంలో పన్నెండు నెలలున్నాయి,
పన్నెండు నెలల కొకసారి వస్తుంది హోలి,
మానవుడు సంతోషంగా వుంటే - ఆనందంగా
గడుపుతాడు హోలీ,
మనం చనిపోయినా - సోదరా - సోదరా - ప్రతి
యేటా జీవనాన్ని యిస్తుంది హోలి,
ఇదిగో హోలీ వచ్చింది సోదరా....సోదరా
నాట్యంచెయ్యి హోలీకి,
గంగానది గర్భంలో, ఏచెట్టు పెరుగుతుంది ?
గంగానది గర్భంలో కొబ్బరి చెట్టు పెరుగుతుంది,
సోదరా...సోదరా...కొబ్బరి పలుకులను గంగా
భవానికి, జమునకు అర్పించు.
గంగానది గర్భంలో ఏచెట్టు పెరుగుతుంది !
గంగానది గర్భంలో గజనిమ్మ చెట్టు పెరుగుతుంది.
సోదరా సోదరా హోలీ వచ్చింది - గంగా భవానికి,
జమునకు గజనిమ్మలు అర్పించు,
ఇదిగో సంవత్సరంలో పన్నెండు నెలలూ వున్నాయి !!

ఈ పాట పాడుతూ రెండడుగులు ముందుకు - రెండడుగులు వెనుకకు వేస్తూ తమ సహజ స్థానాలకు వస్తూవుంటారు. ఈ విధంగా అయిదు సార్లు తిరిగి ఆరోసారి ఎడమవైపుగా గుండ్రంగా తిరుగుతారు. పాటలోని పన్నెండు పంక్తులు ఒక్కొక్కటి రెండుసార్లు చొప్పున పాడుతారు. ఈ పాటకు సుమారు పదినిమిషాలు పడ్తుంది.

పురుషులంతా మామూలుగా చొక్కాలు, ధోవతులు ధరించి అడుగున్నర పొడవున కర్రపుల్లలు పట్టుకొని లయబద్ధంగా పాడుతూ, డప్పుకొడుతూ కోలాటం వేస్తూ హోలి జోజెర ఆచరిస్తారు. సామాన్యంగా పదిలేక పదకొండు జతల పురుషులు డప్పులయకు అనుగుణంగా జోజెర ఆచరిస్తారు. కోలాటాన్ని నడిపించే నాయకుడు ఒంటరిగా ముందు మొదటి వరుస పాడుతూ వుంటే మిగిలినవారు దానిని అనుసరిస్తూ ఈ క్రింది పాటపాడుతారు.

పాట **2** :-

"ఫాగూన్ మిన, మసత్ మిన, ఘర్, ఘర్, బజబజె ఆనంద్,
చెల్ సఖియొ, అపన్ ఫాగూన్ కేల, అప్నె, అప్నె దిల్ కోసన్
కమల - పర్వత్, సుమయొరె, మహాదేవ్ ఆవాజ్ పూతిరె - ఖానూమె,
కేమహాదేవునె, సొనొ - పార్వతి, పాగూన్ కేలెనెకు,
కునదేసాసు, ఆయాముసాఫిర్, బతమ్‌లియ, లోడంగి,
మార్ సేకల్‌కు, బిగాకియాలు, రాహ్‌కు, ఘుమ్ తులాన్‌దీ
రామ, లక్ష్మణ, భారతి, శత్రుజ్ఞు, హనుమాన్ సే పాంయాగహూన్,
కమె మహా దేవ్ సొనొ - రాముజు, హోలికేల్ నెకు,
ఖాది ఖోదివున్, బతకారి, ఇతనె, మె - ఆయ మేరె సుజ్జన్,
ఝూట్‌పాట్ యాసూ, జమె జెమె, వబిచాయ్, భమర్ పలన్,
ఫాగూన్, మిన, మసద్ మిన, ఘర్ - ఘర్, బజ, బజె ఆనంద్,
పర్ తెరే యాంసూ ఫాగూన్ కెలన్ కల్కెలే భజాయె భరమ్."

అంటే :—

"ఆనంద డోలి ప్రతియింటా మ్రోగింది.
ఆనందాబ్ధిలో ముంచే ఫాల్గుణ మాసం వస్తుంది -"
మనమంతా కలసి హోలీ ఆనందోత్సవం చేసుకొందాం -
కమల పర్వతంపైన పార్వతి చెవిలో శంకరుడు గుస గుస
లాడుతూ వున్నాడు.

పార్వతి ముందు మనమంతా రంగులు ప్రదర్శిద్దాం,
ఇదుగో - ఓ పాంథుడా! నీవెటు నుండి వచ్చావ్ ...
ఇదిగో ఈ కర్ర తీసికో హోలీ ఆడుదాం.
నా ఆనందం ... వర్ణనాతీతం ... నేను అపరాత్రిలో వచ్చి
హోలీ ఆడతాను -

హనుమంతుడు అనుసరించగా రామ, లక్ష్మణ, భరత,
శత్రుఘ్నులు యిదిగో వచ్చి హోలీ ఆడతారు.
రాముని యెదుట - వచ్చి హోలీ ఆడమని శంకరు డంటున్నాడు.
శంకరుడు మాటలాడుతూ వుండగా ఆయన అర్థాంగి వస్తుంది.
ఆట అయిపోయిన తర్వాత తన శయనాగారానికి ఆయన్ను
ఆహ్వానిస్తుంది.
"ఇతర స్త్రీలతో హోలీ ఆడటం- రేపు సిగ్గు చేటుకాదా" అని
ఆమె అంటోంది.
ఆనందాబ్ధిలో ముంచే ఫాల్గుణ మాసం వస్తుందని.
ఆనందడోలి ప్రతియింట మ్రోగింది."

ఈ పాటలో ఎక్కువ భాగం - కాలంమార్పును - ప్రజల ఆనంద సంతోషాలను తెలియజేస్తోంది. హోలీ పండుగ సమయంలో మానవులేగాక దేవతలు కూడా హోలీ రంగులు ఆడటానికి యిష్టపడతారు. పరమేశ్వరుడైన శంకరుడు, ఆయన అరాంగి పార్వతి హోలీ డప్పులు శబ్దం విని కైలాస పర్వతం మీద హోలీ ఆడుకుంటారు.

బంజారులు ఆచరించే జోజెరా యితర వర్గాల వారు పండుగలకు వేసే కోలాటం వలె వుంటుంది. ఒక్కొక్కరు రెండు కర్రలు పట్టుకొని కోలాటంవేస్తారు. కాని బంజారులు వేసే జోజెరాకు ఒక్కకర్రనే వుపయోగిస్తారు. వారు గుండ్రంగా నిల్చొని వరుస, లయ ప్రకారం యిరువైపుల వున్న వారి కర్రలతో కొడతారు. డప్పు మ్రోగుతూవుంటే దానిని అనుసరించి ఒక అడుగుముందుకువేసి మోకాళ్ళ మీద వంగి అందరూ ఒక్కసారే ప్రక్కనున్న వారి కర్రలకు కొడతారు...మళ్ళీ అదే విధంగా లేచి వెనుకకు వెళతారు...ఈ క్రింది పాట పాడుతూ ఆడవారిని హాస్యం చేస్తూ గుండ్రంగా తిరుగుతారు.

పాట 3 :—

"ధనిలాయొ, ఖండ్ టోపెరో, మిందేడు లాయొబూర్,
టార్ టోపేరో బారో జాడో, బూర్ మిటో,
అంగీరో, జెలమ్, కూమ్ డిటో, బూర్ మిటో
ధని - రో, మాతాడుకొ - మాల మస్తైలగై,
మిందేడు - రో, మాతాడుకొ - మకతె, రూమ్‌రె."

అంటే :—

"భర్త గోధుమలు, బెల్లం తెస్తాడు. కాని ప్రేమికుడు
రేగిపళ్ళు (Ziziphus) తీసికొనివస్తాడు."
భర్త తెచ్చిన కొబ్బరి బెల్లం చేదుగావుంటుంది
కాని ప్రేమికుడు తెచ్చిన పుల్లని రేగులు అమృతంలా
వుంటుంది.

ఈదినం రేగులు అమృతంలాగున్నాయి–రేపుసంగతి
ఎవరికికావాలి ?

"భర్తకు తలనొప్పివస్తే–తైలంరాస్తే తగ్గిపోతుందంటుంది"
కాని ప్రేమికునికి తలనొప్పివస్తే–క్రిందమీద తెలియక
నీళ్ళలోని చేప బయటపడినట్లు మిట్టాడుతుంది."

పురుషులంతా ఈ పాటపాడుతూ జోజెరా నాట్యం చేస్తూవుంటే స్త్రీ లంతా నవ్వుతూ ఆ నాట్యాన్ని గమనిస్తారు. ఈ పాటవిని ఆనందపడే ఆడవారిని చూసి వారినింకా వుద్రేకపరచాలని జోజెరలోని యువకులు మళ్ళీ ఈ పాటే పాడమని వారి నాయకుడ్ని వత్తిడి చేస్తారు. జోజెరానాయకుడు కూడా యువ కుడే గనుక వెంటనే మళ్ళీ పాడటం మొదలు పెడతాడు. కాని ఈ పాట అస భ్యంగా ఉండి వినడానికి కరువుగానే వుంటుంది. పురుషులీపాట పాడేటప్పుడు స్త్రీలు చిరుకోపంతో నవ్వుతూ వారిమీద వుమ్మి వేస్తారు. ఒకపాటలో మాత్రం వగుసవావిలేకుండా కేవలం స్త్రీపురుషులంతా హాస్యంతో తిట్టుకొంటారు. వాస్త వంగా స్త్రీపురుషులెవరూ ఎవరినీ యీ బూతుమాటలు తిట్టకుండా వదలిపెట్టరు. కాని తాండాలోని అందరూ యీ బూతుమాటలు వినడానికెంతో ఆసక్తిగా వుంటారు. నవ్వుకుంటూ పాడే ఈ పాటలు బంజారుల సాంఘిక జీవనంమీదపలాంటి అపార్థాలను కలిగించవు. తండ్రులు, కుమారులు, సోదరులు, మేనమామలు, బావమర్దులు అనే విభేదం లేకుండా అదే వరుసైన ఆడవారికెదురుగా నిల్చొని ఈ అసభ్యపు పాటలు బంజారులు పాడటం గమనించదగ్గది.

"రంగులాట–అపహాస్యము"

ఆతర్వాత అంతకుపూర్వమే తయారుచేసి దాచుకున్నరంగులు తేవడానికి అందరూ యిళ్ళలోనికి పరుగెత్తుతారు. హోళీ ఉత్సవంలో స్త్రీపురుషులు ఈ రంగులను (బుక్కాయి లేక వసంతం) ఒకరిమీద మరొకరు జల్లుకోవడం చూడ దగ్గది. తమ కష్టాలను మరచి ఆడుతూ, పాడుతూ ఆనందించడంకోసమే హోళీ పండుగ వుద్దేశించబడినది. జోజెరా జరిపేటప్పుడు మొదటపాడే ఒకటి రెండు హోళీ స్వాగతపు పాటలు తప్ప మిగిలినవన్నీ స్త్రీపురుషులు– ఒకరినొకరు అప హాస్యం చేసికొంటూ పాడుకొనేవే. బుక్కాయి కొట్టుకొంటూ–వసంతం ఆడడం శ్రీకృష్ణుడు గోపికలతో ఆడిన వసంతముతో పోలుస్తారు.

రంగులు తయారుచేయడం

హోళీపండుగకు రెండురోజులు ముందు తండాలలోని యువకులంతా పరిసర అడవులకు వెళ్ళి ఎఱ్ఱటి మోదుగ పూలను తీసికొని వస్తారు. ఆపూలను పెద్ద తొట్టిలో వేసి రసంతీసి హోళీకొరకు దాచిపెడతారు. బంజారులలో మోదుగ పూవులరసం వాడకం అనాదిగా వున్నది. దీనికి తోడు వారు బజారుల్లో దొరికే ఎరుపు, పచ్చ రంగులను కూడా ఈ పండగకొరకు యిప్పుడు కొంటున్నారు.

రంగుల మార్పిడి కేవలం కొన్నిబంధు వరుసల్లోను, సమవయస్కులలోను జరుగుతుంది...దీనికి స్త్రీ పురుష విభేదాలు లేవు. స్త్రీలలో మాత్రం వదినా మర దళ్ళు వరుసైనవారే రంగులు కొట్టుకుంటారు. తర్వాత అత్తాకోడళ్ళు వసంతం (రంగునీళ్ళు) కొట్టుకుంటారు. వీరిలో (బంజారులలో) అక్కచెల్లెళ్ళుకూడా రంగులు కొట్టుకుంటారు. పెద్దబావ చిన్నమరదలుపై రంగుకొట్టడు. వీరి ఆచార వ్యవహారాలను గమనించడానికి వెళ్ళినప్పుడు ఆసక్తి కలిగించే ఒక వింతైన సంఘ టన జరిగింది.

“మదనపల్లి క్రొత్త తండాలోని నాయకుడు రుప్లా (Rupla) కు 65 సం॥ల వయస్సు. మోకాలికి ఏదోగాయం తగలడం వలన అతడు నడువలేకుండా వున్నాడు. అతడు ప్రక్కనున్న చేతికర్రలు యిమ్మనే వంకతో ఒక ముసలమ్మను పిలిచాడు. పాపం! ఆ ముదుసలి మామూలుగా దగ్గరకు వచ్చింది. ఆ ముసలి వాడు ప్రక్కనేదాచిన నీళ్ళగొట్టాం తీసి ఆమె తలపైపోసి ఆనందంతో చప్పట్లు కొడుతూ “బురానహోళి” అని అరిచాడు. పాపం ఆ ముసలిది ఏంచేస్తుంది!... పెద్దగా గొణుక్కోవడం తప్ప”? పురుషుల్లో రంగులు కొట్టుకోవడంచూస్తే ఆయుధాలు లేకుండా యుద్ధం చేస్తున్నట్లుగా వుంటుంది. ప్రతివారూ అరుస్తూ, చప్పట్లుకొట్టుకొంటూ—అటూఇటూ ఎగురుతూ వసంతం కొట్టుకుంటూ ఎంతో కోలా హలం చేస్తారు.

హోళీపండుగకు వారు ఖర్చుపెట్టేది కేవలం తినడానికి, త్రాగడానికి మాత్రమే. ఈ వుత్సవానికని క్రొత్తబట్టలు ప్రత్యేకంగా కొనరు. ఒకవేళ క్రొత్తబట్టల కేదైనావెచ్చిస్తే దానిని లెక్కలోవేయరు. ఈ పండుగలో మద్యం త్రాగడానికి వెచ్చించేఖర్చు అమితంగా వుంటుంది. ఈ పండుగ సందర్భంలో కల్లును పంచిపెట్టే విషయంలో వారి సంఘంలో చాలా పట్టింపు వుంటుంది. పురుషులంతా వారి కుటుంబంలోని మగపిల్లలతోబాటు కల్లుబాన చుట్టూ కూర్చొని ఎవరు త్రాగ గలిగినంత వారు ముంతలతో ముంచుకొని త్రాగుతారు. దీనికి హద్దంటూలేదు— ఉండదు. పురుషులతో కలసి స్త్రీలు కల్లు, సారాయి త్రాగకూడదు. కాని పురుషుల సహాయం లేకుండా స్త్రీలే చందాలు వేసికొని యింటిదగ్గర త్రాగవచ్చు. ఒకవేళ ఏకుటుంబానికైనా ఎక్కువ మాంసం కావలసివచ్చినా యివ్వరు. వారికి వచ్చిన భాగంతోనే తృప్తిపడాలి. పండుగకు అయ్యే ఖర్చులో మిగిలినవాటి కంటే త్రాగుడుకే ఎక్కువఖర్చుచేస్తారు. క్రొత్తగాపెళ్ళి అయిన కుమార్తెలను గాని, అల్లుళ్ళనుగాని ఆహ్వానించడంగాని వారికెలాంటి ప్రత్యేకత ఈపండుగలో వుండదు.

---

# మందులవారు—వారి జీవిత విధానము

—కె. పాండురంగరాజు

ఆంధ్రప్రదేశ్ పల్లె ప్రాంతములలో గుంపులు గుంపులుగా తమ తమ సామాగ్రితో ఉదరపోషణకై ఒక గ్రామమునుండి మరొక గ్రామమునకు పోవు మందులవారు కన్పింతురు. వీరు పల్లెలలోను, పట్టణప్రాంతములలోను మందు లమ్ముకొనుచు జీవించెదరు కాబట్టి వీరిని మందులవారని పిలుతురు. వీరు రామాయణగాథ యందలి శివభక్తుడును, రావణాసురుని మేనమామ అయిన మైరావణుని సంతతిగా చెప్పుకుందురు.

మందులవారు పరిసర గ్రామములందు తమ కార్యకలాపములు సాగించుటకు వీలగునట్లు మధ్యస్థమయిన గ్రామమును తమ నివాసమున కనువుగా నిర్ణయించు కొని ఊరి బయలులో తమ గుడిసెల నిర్మించుకొందురు. వీరు ముందుగనే గ్రామాధికారుల వద్దకుపోయి తమ జనాభా, జంతువులు వగైరా వివరములు చెప్పి కొద్ది రోజులపాటు అచ్చట గుడిసెలు వేసుకొనుటకు అనుజ్ఞ పొందెదరు.

వీరు తమ గుడిసెలను 'కర్వలు' అందురు. 'కర్వ' U ఆకారములో 8 అడుగుల పొడవు 5 అడుగుల ఎత్తు ఉండును. ఊడుగ కర్రలను U ఆకారముగ వంచి త్రాళ్ళతో కట్టెదరు. వాటిపై బేసి సంఖ్యలో వుండునట్లు 5కు పైన 'బజగోలు' కర్రలు అనబడు వాటిని 'ఊడుగ' కర్రలకు అడ్డుగా వేయుదురు. గుడిసె వెనుక వచ్చునట్లు మూడు కర్రలు కట్టెదరు. వీటిని 'మూడు' కర్రలు అందురు. గుమ్మమువద్ద కట్టెడి కట్టెలను 'ఆకిడి' కట్టెలు అందురు. ఈతాకులతో అల్లిన రెండు చాపలను దానిపై కప్పి పైన తాటాకు చాపలను వేయుదురు. ఈతాకు చాపలు మాత్రము పైకి కన్పించరాదు. అట్లు కన్పించుట వీరి కులము తక్కువగా భావింతురు.

ఒక ప్రాంతమునుండి మరొక ప్రాంతమునకు తరచుగా తిరుగుచుండుటవలన, జీవనోపాధికై అనేక వృత్తుల నవలంభించుటవలన వీరిలో ఉమ్మడి కుటుంబములుగా నుండుటకు అవకాశములు తక్కువ. అందువలన వీరిలో విడి కుటుంబములే ఎక్కువ. భార్యాభర్తలు పెండ్లి కాని సంతానముతో చిన్న కుటుంబములుగా వుందురు. సామాన్యముగా పెండ్లి అయిన పిమ్మట భార్యాభర్తలు వేరే కుటుంబముగా ఏర్పడుదురు. కుటుంబమునకు తండ్రి పెద్ద. మిగిలిన కుటుంబ సభ్యులు అతని అధికారము క్రిందనే వుందురు. తండ్రి అనంతరము అన్నదమ్ములలో పెద్దవాడు అధికారిగా వ్యవహరించును. ఆస్తిపాస్తులను మగపిల్లలు మాత్రమే పంచుకొందురు. వంశక్రమము తండ్రినుండియే లెక్కింపబడును. తండ్రి యింటి పేరు మగ సంతానమునకు సంక్రమించును.

మందుల వారిలో పది గోత్రములు కలవు. ప్రతి కుటుంబము వీటిలో ఏదో ఒక గోత్రమునకు చెందును. ఒక గోత్రమునకు చెందిన వారందరు ఒకే మూల పురుషుని సంతానముగా భావింపబడుదురు. తండ్రి గోత్రమునకే సంతానముకూడ చెందెదరు. ఒకే గోత్రములో వివాహసంబంధములుండవు. వీరు కొన్ని గోత్రముల వారితో మాత్రమే వివాహసంబంధము లేర్పరచుకొనవచ్చును. మిగిలిన గోత్రములతో నిషేధింపబడినది. ఏ గోత్రముల వారితో వివాహ సంబంధములు నిషేధింపబడినవో ఆ గోత్రములు 'సహోదర గోత్రములు' అనబడును. సంబంధము లంగీకరింపబడిన గోత్రములు 'వరుస గోత్రములు'. సహోదర గోత్రముల వారి మూలపురుఘుడు ఒకరే అయివుందురని వీరు భావించెదరు. ఒంటెద్దు, యార్వ, సరికొండ గోత్రములు సహోదర గోత్రములు. అటులనే సింగజోగి, ఆడపల్లి, జల్లి, ఒరగంటి, పిన్నెపురాళ్ళ, చెన్నబత్తిని సహోదర గోత్రములు కాగా, 'వాసనల్ల' గోత్రమునకు సహోదర గోత్రము లేవియులేవు, సహోదర గోత్రములు ఎక్కువగానున్న వారి వరుస గోత్రములలోనున్న ఆడపిల్లలకు మంచి గిరాకి. అందువలన ఎక్కువ సహోదర గోత్రములున్నవారు తమ వరుస గోత్రములనుండి అమ్మాయిలు లభించెదరో లేదో అను భయముచే తమకు వరుస కలిసిన కుటుంబములో గర్భిణీస్త్రీవున్నట్లు తెలిసినచో ఆడపిల్ల పుట్టిన యెడల వయస్సు వచ్చిన పిమ్మట తమ అబ్బాయికి యివ్వవలసినదిగా నాలుగయిదు రూపాయలు భజానా, 'ఓలి రూపాయి' 'కాపు' ద్వారా యిచ్చెదరు. దీనినే వీరు 'కడుపు కోరుకొనుట' అందురు. రెండవ వైపువారు దీనిని వ్యతిరేకించరాదు. ఒకవేళ మగపిల్లవాడు జన్మించిన 'భజానా' వాపసు చేయబడును.

మందుల వారిలో సాధారణముగా ఏక భార్యత్వమే అనుసరణలో నున్నది. బహుభార్యత్వము నిషేధము కానప్పటికి అరుదుగా ఆచరణలో నున్నది.

భార్యాభర్తలిద్దరు కుటుంబపోషణకై పాటుపడెదరు. భర్త వేటాడుటకు, చేపలు పట్టుటకు పోవును. భార్యా, పిల్లలు మందుకు పనికివచ్చు మూలికలు, ఆకులు ప్రోగుచేయుట, మందులు అమ్ముట మొదలగు పనులు చేయుచు భిక్షాటన చేయుదురు. గుడిసెలు నిర్మించుటయందుకూడ స్త్రీలు సహాయముగనుందురు. పిల్లల సంరక్షణ స్త్రీల బాధ్యతయే. ఇతర ఆదివాసి తెగల వారివలె గాక వీరిలో స్త్రీలు కూడ దైవసంబంధమైన పూజాది కార్యక్రమములు నిర్వర్తించుటకు అర్హులు. మగవారికి లోబడి వుండవలసినప్పటికి వీరిలో స్త్రీలను తక్కువగా భావించరు. ఆడపిల్లలను, మగపిల్లలనుకూడ వీరు సమాన ప్రేమాభిమానములతో చూసెదరు. పిల్లలుకూడ తమ తలిదండ్రుల దైనందిక కార్యక్రమములందు సహాయముగ నుందురు.

వీరి వివాహములు సామాన్యముగ పెద్దల యిష్ట ప్రకారముగనే జరుగును. కుల పెద్దఅయిన 'కాపు' సంప్రదింపులు జరిపి వివాహములు నిశ్చయించును. వీరిలో కన్యాశుల్కము యివ్వవలసియుండును. ప్రస్తుత పరిస్థితులలో యీ శుల్కము రోజు రోజుకు పెరుగుచున్నది. స్త్రీ తన భర్తను వదలి మరొకరిని

వివాహమాడినయెడల ఆమె కన్యాశుల్కముగా తీసుకొన్న మొత్తము తిరిగి చెల్లింపవలసియుండును. విడాకులు, స్త్రీ పునర్వివాహము, విధవావివాహము వీరిలో అంగీకరింపబడును. మేనత్త, మేనమామ బిడ్డలను వివాహమాడవచ్చును.

వీరికి ప్రత్యేకమయిన మతము, పండుగలు, దేవతాగణముగాని వున్నట్లు కానరాదు. మత విషయంలో వీరిపై హిందూమత ప్రభావం ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. సామాన్యముగా హిందువులు జరుపు పండుగలన్నియు వీరు జరుపుకొందురు. హిందూ దేవతా గణమును వీరు పూజించెదరు. కాని అన్ని ముఖ్య సందర్భములలోను వీరు బంగారు మైసమ్మ, పోచమ్మ అను దేవతలను కొలుతురు.

వీరు జననం మొదలు మరణం వరకు జీవితంలో జరుగు అన్ని ముఖ్య ఘట్టములలోను పూజాదికార్యక్రమములను, విందులను జరుపుకొందురు. స్త్రీ పురుష సంపర్క ఫలితము వీరికి తెలిసినప్పటికి పిల్లలు దేవుని మహిమవలననే కలుగుదురని భావించెదరు. గర్భము దాల్చిన స్త్రీలు పూజాదికార్యక్రమములందు పాల్గొనరాదు. భర్త తన భార్య గర్భము దాల్చినయెడల ప్రసవించువరకు గడ్డమునకు క్షురకర్మ చేయించరాదు. ఆ యింటికి క్రొత్తకుండలుగాని, క్రొత్త వస్త్రములుగాని తీసుకు రాకూడదు. ఇందుకు వ్యతిరేకముగా ప్రవర్తించినయెడల తల్లికి, శిశువుకు హాని కలుగునని వీరి నమ్మకము. కాన్పులు వారు నివసించు గుడిసెయందుగాక దానికి చేర్చి నిర్మింపబడిన ప్రత్యేక గుడిసెయందు జరుపుదురు. అనుభవమున్న మందుల స్త్రీయే ప్రసవ సమయమున మంత్రసాని ( Midwife ) గా వుండును. అటువంటి స్త్రీ దొరకనిచో మంగలి స్త్రీని సహాయముగ నుండుటకు పిలుతురు. ప్రసవించిన స్త్రీచే ఐదు రోజులు పథ్యము చేయించెదరు. పిప్పళ్ళు, వేపబెరడుతో తయారుచేసిన పొడిని తినుపింతురు. మూడవ రోజున మొదటి శుద్ధి స్నానము చేయించెదరు. ఐదవ రోజున రెండవ శుద్ధి స్నానము జరుగువరకు ఆ స్త్రీ పురిటి మైలపట్టును. మొదటి శుద్ధి స్నానమునాడు పప్పు అన్నము, మాంసము, మద్యములతో కులస్థులకు విందు చేయుదురు. ఇంటింటికి ఒక్కొక్కరినయినను ఆ రోజున తప్పక విందుకు పిలువవలెను. ప్రసవించిన స్త్రీ తన భర్తతో కనీసము మూడు నెలల వరకు సంభోగించరాదు. పుట్టిన పదిహేను రోజులలోపుగానే ఉదర సంబంధమయిన రోగములు రావనే దృష్టితో బొడ్డుచుట్టు శిశువుకు కాల్పులు (సూది పువ్వులు) వేయుదురు.

పుట్టు వెండ్రుకలు తీయు సమయమున మేనమామ ముఖ్య పాత్ర వహించును. ఆ దినము గొర్రెపోతునుగాని, మేకపోతునుగాని వేటవేయుదురు. పసుపు కుంకుమలతో దాని ముఖమునకు బొట్లు పెట్టి, గుగ్గిలము, సాంబ్రాణి పొగ దానికి పట్టెదరు. బలి పశువు తన ఒల్లు జలదరించువరకు ఆలాగున చేసి పిమ్మట పోచమ్మ దేవతకు దానిని బలి యిచ్చెదరు. ఆ రోజు కులస్థులకు ఆ మాంసముతో విందు చేయుదురు.

స్త్రీ యుక్తవయస్కురాలయిన సమయమున ఆమెను వేరుగావుంచి ఐదవ రోజున శుద్ధి స్నానము చేయించెదరు. ఆమెకు ఆ ఐదు రోజులు బెల్లము, ఎండు కొబ్బరి కలిపిన అన్నము మాత్రము పెట్టెదరు.

ముందుగా పురుషులకు వివాహము తరువాత
స్త్రీలకు వివాహమునకు ముందుగా పురుషులకు వివాహము తరువాత ఎప్పుడయినను ఇది
"మోక్షము" జరుపవలసి యున్నది పురిటి వెండ్రుకలు తీసినపిమ్మట ఎప్పుడయినను ఇది
జరుపవచ్చును. పినతండ్రి, పెదతండ్రి వరుసగలవారిలో ఒకరికి కాషాయిరంగు వస్త్ర
ములు కట్టించి, ముఖమునకు విభూతి వ్రాసి, మెడలో రుద్రాక్షలు, చేత కమండలము
ధరింపజేసి గురువుగా చేయుదురు. అతని పాదములను ఆమెగాని, అతనుగాని
పాలతోగాని నీళ్లతోగాని కడిగి, ఆ కడిగిన పాలనుండిగాని, నీరునుండిగాని ఒకటి
రెండు చుక్కలు సేవించవలెను. అగ్నిసాక్షిగా గురువుసాక్షిగా కులకట్టుబాట్ల
కనుగుణముగ ప్రవర్తించెదనని వాగ్దానము చేయవలెను. ఈ వాగ్దాన తదనంతరమే
పురుషుడు తండ్రి గోత్రమువానిగా భావింపబడును. స్త్రీ అయిన ఎడల పెండ్లి
అయి అత్తవారింటికి బయలుదేరునప్పుడు ఈ విధముగ చేయవలెను. తదనంతరము
ఆమె యితర గోత్రమునందు కలిసినట్లు పరిగణింపబడును. సామాన్యముగ మగ
వారికి 'మోక్షము' ప్రత్యేకముగ జరుపక ఏదేని కార్యము జరుపునప్పుడు జరు
పుదురు.

వివాహ విషయములలో 'కాపు' శ్రద్ధతీసుకొనును. అతనే సంబంధ
ములు చూచును. వారి ప్రాంతము గాక యితర ప్రాంతమువారితో సంబంధ
మయిన యిరువైపులవారి కాపులు సంభాషణలు జరుపుదురు. 'విడెము' అనగా
ముహూర్తము పెట్టుట. 'విడెము' నాడు పిల్లవాని తరఫువారు ఆడపిల్ల వైపు
వారికి ఐదురూపాయలు, తాంబూలము యిచ్చెదరు. చీర, రవికకూడ యిచ్చెదరు.
అమ్మాయి తల్లికి ఒకరూపాయి యిచ్చెదరు. దీనిని 'ఓలి రూపాయి' అందురు.
పెండ్లి జరుగు తావు, సమయమును కాపు నిర్ణయించును. ఈ నిర్ణయించుటను
'గొత్తు' అందురు. 'గొత్తు' ప్రకారము యిరుపక్షములవారు ఆ సమయమునకు
నిర్ణీత ప్రాంతమునకు రావలసియుండును వీరు తరచు గ్రామగ్రామముల తిరుగు
చుందురు. కాబట్టి యిరుపక్షములవారికి వీలుగనుండు స్థలమును నిర్ణయించు
కొందురు. అదియుగాక ఆ గుంపువారు జరుపదలచుకొన్న వివాహములన్నియు
ఆ నిర్ణీత ప్రాంతముననే జరుపుకొనుటకు నిర్ణయించుకొందురు. అందువలన
వారందరు ఒకచోట సమావేశమగుటకు, తక్కువ ఖర్చుతో వివాహములు జరుపు
కొనుటకు వీలగును. 'ఓలి' 'ఠంకము' లలో నిర్ణయించుకొందురు. 'ఠంక'
మనగా పదహారు రూపాయలు. 'ఓలి' నుండి కులము కొంత తీసుకొని మిగిలినది
అమ్మాయి తల్లి దండ్రులకు యిచ్చెదరు.

పెండ్లికి నాదస్వరము తప్ప యితర వాయిద్యములుండవు. ఇరుపక్ష
ముల వారు 'అరివేణిని కుండలు' చేతబట్టుకొని కఱ్ఱసాము చేయుచు ఎదురుకొనెదరు.
దీనిని వీరు 'ఎదురుకోలు' అందురు మంగలి, పెండ్లి కుమారునకు గడ్డము, మీసము,
తలమీది జుట్టుతీసి ముఖమునకు, శరీరమునకు పసుపు వ్రాయును. పెండ్లికుమార్తెకు
స్నానము చేయించి పెండ్లికుమారుడు తెచ్చిన కొత్తబట్టలు ధరింపచేయుదురు.
పెండ్లి అరుగుపై దుప్పటి పరచి మంగలి నాలుగు వరుసలు వచ్చునట్లుగ జొన్నలు
పోయును. దీనినే 'మైలపోలు' అందురు. మామిడాకులు, పసుపు కొమ్ములు నాలుగు
రాట్లకు కట్టును. చాకలి బియ్యముతో నాలుగు మూలల చిన్న ప్రోగులు చేయును.

దీనినే 'ముత్యాల పోలు' అందురు. పెండ్లి కుమారుని, పెండ్లికుమార్తెను పెండ్లి అరుగుపై కూర్చుండ బెట్టెదరు బంగారముతో తయార్హు చేయబడిన 'పుస్తె'ను పెండ్లి కుమారుడు పెండ్లి కుమార్తె మెడచుట్టు వచ్చునట్లు ముడివేయును. మరుసటి రోజున నాగవెల్లి జరుపుదురు. ఆరోజున అరివేణి కుండలు పెండ్లికుమారుని యింటికి తీసుకొని వెళ్ళెదరు. ఆరోజున అతిథులకు ఖర్జూరము, తమలపాకులు, లవంగాలు యిచ్చెదరు మద్యముతోను, మేక లేక పంది మాంసముతోను ఆరోజున విందు చేయుదురు. అతిథుల యెదుట వధూవరులు సగము తినిన పిండి వంటలు ఒకరి నుండి మరొకరు మార్చుకొని తిందురు.

పెండ్లి అయిన పిమ్మట పెండ్లి కుమారుడు అత్తమామలకు ఒక సంవత్స రముగాని అంతకంటె ఎక్కువ కాలము గాని సహాయముగ నుండవలెను దీనినే వీరు 'సంఘాతము' అందురు గుడిసె వేసుకొనుటకు అవసరమయిన త్రాళ్ళు పేనవలెను. చాపలు అల్లవలెను గుడిసె నిర్మించుట యందు, వేటాడుట యందు సహాయపడ వలెను తాను వేటనుండి తెచ్చిన వాటిలో కొంతభాగము వారికి యివ్వవలెను. 'సంఘాత' కాలము పూర్తి అయిన పిమ్మట తాను వేరు కుటుంబము ఏర్పాటు చేసు కొనవచ్చును

వీరు మృతదేహములను పసుపు కుంకుమ వ్రాసి తడకలను గోపురా కారముగ కట్టి అందు కూర్చుండ బెట్టి స్మశానమునకు తీసుకు వెళ్ళెదరు. శవమును కూర్చున్న స్థితిలో, ఉత్తర దిక్కు ముఖము, దక్షిణ దిక్కు వీపు వుండు నట్లుగ భూమియందు ఖననం చేయుదురు. గర్భవతి మరణించిన పిండమును వేరు చేసి పూడ్చెదరు. చనిపోయిన వారి గోత్రము వారందరూ పదిరోజుల వరకు గడ్డముగాని మీసముగాని తీయరాదు.

మూడవరోజున చనిపోయిన వారి బావమరదిగాని, ఆ వరుస గలవారు గాని స్మశానమునకు కోడిమాంసము, పిండి వంటలు, మద్యము తీసుకు వెళ్ళవలెను. సమాధి వద్ద పాదముల దగ్గర రంధ్రములు చేయుదురు. కుమారుడు లేక కర్మచేయు మరెవ్వరైనను తన రెండు చేతులతోను రొట్టె, అన్నము, కూరలు వేసి మద్యము పోయును. చనిపోయిన వారిని దెయ్యము కావలదని మ్రొక్కును

పదవరోజు పిమ్మట చనిపోయినవారు దెయ్యమైనదీ లేనిదీ తెలుసుకొను టకు గాను ఆకుటుంబము వారిని సోదెచెప్పు ఎరుకల వారి వద్దకు గాని వేల్పుల వారి వద్దకు గాని పెద్దలు పంపెదరు దెయ్యంకాలేదని వారు చెప్పిన యెడల 'పోచమ్మ' దేవతకు గొఱ్ఱెపోతును బలియిచ్చెదరు. దెయ్యమయినదని వారుచెప్పిన యెడల దానిని సంతోష పరచుటకు గాను అన్నపుముద్దపై ప్రేతాకారమును చేసి కులమునకు హాని చేయవద్దని, వారందరికి సుఖము కలుగ చేయవలెనని మ్రొక్కి ఆడమేకను బలియిచ్చెదరు. తదుపరి ఆయింటి వారిని వారియింటియందు దెయ్య మున్నది గనుక ఆగ్రామము వదలి పొమ్మని ఆజ్ఞాపింతురు. ఆదెయ్యము పోయిన దని వారు నిరూపించిన పిదపనే మరల వారిని ఆ గ్రామమునకు రానిచ్చెదరు.

మందులవారు వారి వృత్తినిబట్టి ఆ విధముగ పిలువబడుచున్నారు. వీరు అమ్ము మందులు కొన్ని విలువయినవి అయినప్పటికి అధిక భాగము బూటకపు మందులే. గ్రామ ప్రజానీకము వీరు చేయు మోసములో అతి సులువుగా పడిపోవుదురు. తెల్లమద్ది, తిప్ప తీగ వేళ్లు, చింత ఆకు వేరు వేరుగా వేపించి పొడిచేసి పొట్లములుగా కట్టెదరు. మెరుపుడు రాళ్ళను పొడిచేసి వస్త్రకాళితముచేసి వేరుగా కట్టెదరు. ఈ పొట్లములను 'జోలి' లలో వేసుకొని గ్రామములు తిరుగుచు విలువయిన మందులుగా అమ్మెదరు. జబ్బుపడినవారి నాడిచూసి వారు భయంకరమైన వ్యాధులతో బాధపడుచున్నట్లు చెప్పిముందు వైద్యుడు భయపెట్టును తన వద్ద వాటి నివారణకు సరియయిన మందులు గలవని, భయపడవలసిన అవసరము లేదని చెప్పును తనకు డబ్బుపై ఆశలేనట్లును, వ్యాధినివారణయే అతని పుద్దేశ్యమయినట్లును నటించును అదియుగాక వ్యాధినివారణానంతరమే తనకు సొమ్ము యివ్వవచ్చునని హామీ ఇచ్చును దీనినే వీరు "అరువుకనిక" అందురు మందు ఇచ్చునప్పుడు ఆ మందు ఫలానా మందుతో కలిపి పుచ్చుకొనవలెనని చెప్పును మందులు కలుపు విధముకూడ ఆ రోగికి అర్థం కాకుండ చెప్పును అది అర్థముకాక ఆ రోగి మందులున్న యెడల అవికూడ యిచ్చి మందులు కలిపి యివ్వవలెనని అతనిని కోరును అవి తనవద్ద లేవని తనకు తెలిసిన మరియొక మందులవాని వద్ద కలవని చెప్పి అతనిని పిలిపించి అతనినుండి వాటిని కొనిపించును అవి కూడ విలువలేని ఆకుల, రాళ్ళపొడులే. ఆ సొమ్మే దక్కుదలయని ఆ మందుల వారిద్దరు దానిని పంచుకుందురు.

కుమ్మరిమట్టిని వస్త్రకాళితముచేసి దానిని కణిక తీరునచేసి కాల్చి తమవెంట తీసుకొని వెళ్ళెదరు. మనిషికి నొప్పివున్నచోట ఆ కణికను ఎర్రగా కాల్చి అంటించెదరు. అది విలువయిన వనమూలికయని చెప్పి అమ్మెదరు. తెల్లవుసిరి, నల్లవుసిరి, ఎర్రచిత్ర మూలము, చింత ఆకు చూర్ణములను ఖరీదయిన మందులుగా అమ్మెదరు.

వీరు పాము కాటుకుకూడ తమవద్ద విలువయిన మూలికలు గలవని చెప్పుదురు. ఆ మూలికలు కొనిపించుటకుగాను వారు ప్రజలను అనేక విధములుగ మోసము చేయుదురు. పచ్చగురివింద, నక్కకొమ్ము తమ వద్దగలవని అవి కలిగిన వారు ధనవంతులగుదురని బూటకపు కబుర్లు చెప్పి అమాయక ప్రజలచే వాటిని కొనిపింతురు. గురివిందకు పచ్చరంగు వేసి పచ్చగురివింద అనియు, ఎముకను కొమ్ము ఆకారములోచెక్కి నక్కకొమ్ము అనియు చెప్పి ప్రజలను నమ్మించెదరు.

మందులవారు వేటాడుటయందు బహునేర్పరులు. వీరివద్ద మొసలి, కుందేలు, ముండ్లపంది, పంది, ఉడుత, చేపలను పట్టుటకు వేర్వేరు వలలు, బరిసె, నిరికోల మొదలయిన కత్తులు వేటాడుటకు వుండును వీరు అడవిపంది, ముండ్లపంది, చిరుతపులి, తోడేలు, మొసలి, భూతహాస్యము, నక్క, జంగుపిల్లి, భూతపిల్లి, చెవులపిల్లి, నీటికుక్క మొదలగు జంతువులను వేటాడుదురు. అడవిపంది, తోడేలు, నక్క, చెవులపిల్లి. ఎలుక మరియు యితర పిల్లిజాతి జంతువుల, పక్షులయొక్క మాంసమును తిందురు. భూతహాస్యము, భూతపిల్లి, ఉడుము, మొసలి మొదలగు జంతువులనుండి

మందులకుపయోగించు భాగములను తీసుకొందురు. ముండ్లపంది ఈకలను అమ్మెదరు. వీరికి చేపలు, పీతలు (ఎండ్రకాయలు) అన్న బహు యిష్టము గాలముతోను వలలతోను వాటిని పట్టెదరు. సామాన్యముగా అందరూ కలిసి వేటకు పోవుదురు. 'కాపు' యితర పెద్దలతో సంప్రదించి వేటకు వెళ్ళవలసిన రోజు నిర్ణయించును. శక్తిగల వారందరూ తప్పక వేటకు వెళ్ళవలయును. వేటలో వారికి జంతువులు దొరకనియెడల ఆ వేటకు రానివారి మట్టిబొమ్మలను చేసి వారివలననే వేట లభించలేదని వారిని దూషించెదరు. వేటయందు లభించినవాటిని వేటకు వచ్చినవారందరూ వారి వారి కుటుంబ జనాభాను బట్టి సమముగా పంచుకొందురు.

మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలలో మందులవారు సానరాళ్ళను తయారుచేసి గాడిదలపై గ్రామ గ్రామములకు తీసుకొనివెళ్ళి అమ్ముకొనుచు జీవనము చేయుచున్నారు. కొంతమంది ఆధునిక పద్ధతులలో రసౌషధములను, షడ్గుణము, శ్వేత సింధూరము, మకరధ్వజము, పూర్ణచంద్రోదయము, కస్తూరి మొదలగు ఆయుర్వేద మందులు తయారుచేసి అమ్ముకొనుచు వైద్యులకుకూడ సరఫరా చేయుచున్నారు.

మందులవారికి 'కులపంచాయితీలు' కలవు. తమవారందరిని సంఘ కట్టుబాట్లకు అనుగుణముగ నడపించుట, వృత్తి రహస్యములు బయటపడకుండ చూచుట, జాతి కల్మషము కాకుండా జాగ్రత్తవహించుట కులపంచాయతీ విధులు. కుల పెద్దను 'కాపు' అందురు. అతనికి విధుల నిర్వర్తించుటయందు సహాయకారిగా 'ఘటాపురి' వుండును. వీరిద్దరు వంశపారంపర్యముగా పెద్దలుగా నుందురు. 'కాపు' గా నుండుటకు 'ఒంటెద్దు' గోత్రమువారు మాత్రమే హక్కుదారులు. అటులనే 'ఆడపల్లి' గోత్రమువారు 'ఘటాపురి' గా నుండుటకు అర్హులు. కులస్థులలో వచ్చిన తగాయిదాలను, ఆస్థిపాస్తుల వివాదములను తీర్చుట; ఆచార వ్యవహారనులకు వ్యతిరేకముగ ప్రవర్తించువారిని శిక్షించుట 'కాపు' కర్తవ్యము. కులమునకు సంబంధించిన వ్యవహారములన్నింటిని 'ఘటాపురి' సహాయముతో 'కాపు' చక్కబెట్టును. కట్టుబాట్లు తప్పినవారిని నేరములనుబట్టి శిక్షించును.

మందుల స్త్రీతో అధిక కులస్థుడు అక్రమ సంబంధ మేర్పరచుకొన్న యెడల ఆమెను అతనికిచ్చి, బలవంతముగ వివాహము చేయుదురు. తక్కువ కులస్థునితో సంబంధ మేర్పరచుకొన్న స్త్రీని తమనుండి బహిష్కరించెదరు. పరస్త్రీతో అక్రమ సంబంధమేర్పరచుకొన్న పురుషుడు పట్టుబడిన యెడల అతనిని వలలో కట్టి చెట్టుకు వ్రేలాడతీయుదురు. కొన్ని సమయములందు వాని నడుమువంచి పైన పెద్ద చదునైన రాయిపెట్టి దానిపై మరదలు వరుసగలవారిని కూర్చుండబెట్టెదరు. అన్యులతో సంభోగించిన స్త్రీకి 'రంకుతప్పు' వేయుదురు. రెండవ పర్యాయము ఆమె మరల ఆ విధముగ ప్రవర్తించినయెడల ఆమె భర్తచే ఆమెకు విడాకులిప్పించెదరు. అధిక కులస్థుడు మందులస్త్రీతో సంబంధమేర్పరుచుకొన్న యెడల వారిద్దరికి పెండ్లిచేసి బంగారు వుంగరమును ఎఱ్ఱగా కాల్చి అతని నాలుకపై కాల్పువేసి అతనిని తమ కులమందు చేర్చుకొందురు.

నేరస్థులవద్ద జుల్మానాగా తీసుకొన్న మొత్తమును వీరు విందులకు వుపయోగించెదరు. సామాన్యముగా జుల్మానా విందు రుపముగనే విధించెదరు. గొఱ్ఱెపోతునుగాని, మేకపోతునుగాని బంగారు మైసమ్మ దేవతకు బలియిచ్చి ఆ మాంసమును అందరూ పంచుకొందురు.

జీవిత ముఖ్య సంఘటనల సందర్భముగా జరుపు కార్యక్రమములన్నియు 'కాపు', 'ఘటాపురి' సలహాలననుసరించియే జగుపుదురు వృత్తి, వేటకు సంబంధించిన వ్యవహారములలో వారి సలహాలను మందుల వారందరు పాటించెదరు.

మందులవారి అభివృద్ధి గురించి ప్రభుత్వమువారు కొన్ని పథకములు చేపట్టవలసి యున్నది కాలనీలు నిర్మించి ఉచితముగాగాని, సబ్సిడీ పద్ధతిలోగాని గృహములను యిచ్చి వారిని స్థిరనివాసుల చేయవలసి యున్నది. వారు తయారు చేయుమందులు సరియైనవి కానప్పటికి వారిలో కొంతమందికి ఆయుర్వేదములో అనుభవమున్నది. సామాన్యముగా మందులవారందరికి వివిధ వృక్షజాతుల ఆకులు, వ్రేళ్ళు, బెరడుల లక్షణముల గురించి తెలియును కొన్ని కొన్ని వస్తువుల గుణప్రభావముకూడ వారికి తెలియును. ఈ అనుభవమును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వమువారు వీరికి సరియైన ఆయుర్వేదమందుల తయారీలో శిక్షణ యిప్పించవలెను. వారు శాస్త్రయుక్తముగా తయారుచేసిన మందులు ప్రమాణములు (Standard quality) నిర్ణయించి ప్రభుత్వము సరియైన ధరకు తీసికొని వారిని ప్రోత్సహించవలెను. ఈ మందులకు బజారులో మంచిగిరాకి ఏర్పడు అవకాశములు గలవు. ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రులకు కూడ వీటిని సప్లయి చేయవచ్చును. ఈ వైద్యములో అనుభవముగల మందులవారికి తగిన శిక్షణయిచ్చిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యులుగా నియమించవచ్చును. మందులవారు ప్రోగు చేయు ఇండిప, కరక్కాయ మొదలగు వాటికి మంచిగిరాకి గలదు. సహకార సంఘములు ఏర్పరచి వారు తయారుచేయు వివిధ వస్తువులకు సరియగు ధరవచ్చునట్లు ప్రభుత్వము చూడవలెను వీరు నివసించు కాలనీలలో వైద్య, విద్యా సౌకర్యములు కలుగ చేయవలెను. ఈ విధముగ ప్రభుత్వము బాధ్యత వహించిన యెడల కాలక్రమేణా మందులవారు అభ్యున్నతికి రాగల అవకాశములుగలవు.

---

# ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిమవాసులు*

Tribal Cultural Research & Training Institute LIBRARY Hyderabad

— సోమశేఖర్

శ్రీకాకుళం జిల్లాలోని మహేంద్రగిరి శ్రేణులనుండి ఆదిలాబాదులోని మెహబూబ్ ఘాట్ వరకు వ్యాపించి గోదావరి, నాగావళి, శబరి, కిన్నెరసాని నదీ జలాలతో పునీతమై, రమణీయప్రకృతికి ఆలవాలమైయున్న సువిశాల అనుసూచిత ప్రదేశమే ఆంధ్ర ప్రదేశ్‌లోని లక్షలాది ఆదిమవాసుల నివాసస్థానము. 1956 మెడు ్యల్డ్ తెగల జాబితా ప్రకారము ఆంధ్రప్రదేశ్‌లో 33 అనుసూచిత తెగలు గలవు 1961 జనాభా లెక్కలప్రకారం మన రాష్ట్రంలోగల 13.24 లక్షల ఆదివాసులు 11,595 చదరపు మైళ్ళు వైశాల్యంగల అనుసూచిత ప్రాంతంలో గల 4,346 గిరిజన గ్రామములలోను. చెదురు మదురుగా కేంద్రీకృతమైన గిరిజన ప్రాంతాలలోను మరియు మైదాన ప్రాంతములలోని అసంఖ్యాక గ్రామాలలో యితర గ్రామీణులతో కలసిమెలసి నివసిస్తున్నారు.

ఉత్తుంగ పర్వతశ్రేణులు, కమనీయ కొండలోయలు, దట్టమైన అరణ్యములతో నిండిన ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, ఉభయ గోదావరి, విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలలో వ్యాపించియున్న అనుసూచిత ప్రాంతాలలో కోయ, కొండరెడ్డి, నాయకపోడు, గోండ్, కొలామ్, అంధ్, ప్రధాన్, తోటి, భిల్, భగత, గదబ, కొండదొర, మూఖదొర, రెడ్డిదొర, మన్నెదొర, సామంత, సవర, జాతపు, వాల్మీకి, కమ్మర, కోటియా, మాలి, మూలియా, పోర్జ, చెంచు మున్నగు తెగలు నివసించుచున్నారు. ఏనాది, ఎరుకల, సుగాలి తెగలు మాత్రం ముఖ్యంగా మైదాన ప్రదేశములలోని గ్రామాలలో నివాస మేర్పరచుకున్నారు.

33 తెగలకు చెందిన ఆంధ్రప్రదేశ్ లోని ఆదివాసులు విభిన్నమైన భాషలు మాట్లాడెదరు. శ్రీకాకుళం జిల్లాలోని సవరులు, విశాఖపట్టణం జిల్లాలోని గదబలు మాట్లాడే భాషలు ముండారి భాషాకుటుంబమునకు సన్నిహితమైనవి. అవే ప్రాంతాలలో నివసించుచున్న సామంతుల మాతృభాష 'కువి', కొండదొరల మాతృభాష. 'కుబి' వీటికి పూర్తిగా విభిన్నమైనవి. నాయకపోడుల మాతృభాషయైన 'నాయకపోడి', కొలాముల మాతృ భాష 'కొలామి', గోండుల మాతృభాష 'గోండి', కోయల మాతృభాష 'కుయి', మరియు 'కుభి', 'కువి' భాషలు ద్రావిడ భాషా కుటుంబమునకు చెందినవి. రంగు రంగుల దుస్తులతో ఆంధ్రప్రదేశ్ అంతటా కనుపించే బంజారులని పిలువబడే సుగాలీలు మాట్లాడే 'భంజారా' భాష ఉత్తర

*ఆకాశవాణి, హైదరాబాదు కేంద్రమువారి సౌజన్యముతో

భారత భాషా కుటుంబమునకు సన్నిహితమైనది. కాని మన రాష్ట్రంలో ఉన్న ఆదివాసులందరు తెలుగు ధారాళంగా మాట్లాడెదరు. శ్రీకాకుళం, విశాఖ జిల్లాలలోని సరిహద్దు ప్రాంతాలలో నివసిస్తున్న బగత, మూకదొర, కొండదొర, వాల్మీకి, పోర్జ, కోటియా, సవర, జాతపు, మాలి తెగలు తెలుగుతోపాటు ఒరియా కూడ మాట్లాడెదరు. వీనిలో దేనికి సహజమైన లిపి లేదు. సవర, గోండి, బంజార భాషలకు దేవనాగర లిపుల నుపయోగించి అభివృద్ధిచేయుటకు ప్రభుత్వం కృషిచేయుచున్నది.

మన ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆదిమవాసుల యొక్క ముఖ్యవృత్తి వ్యవసాయము. వీరి వ్యవసాయము చాలవరకు పురాతన పరికరాలతోను సనాతన పద్ధతులపైన మరియు వర్షాధారమగుటచే ఎకరానికి కనీసపు ఉత్పత్తి చాల తక్కువగా ఉన్నది. శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలలోని కొండ ప్రాంతములలో నివసించుచున్న సవరలు, సామంతులు, గదబలు, కొండరెడ్లకు 'పోడు' వ్యవసాయముకూడ ముఖ్యమైన జీవనాధారముగా ఉన్నది. ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలలో నివసించుచున్న గోండ్లు, నాయకపోళ్ళు, కోయలు చాలావరకు స్థిరమైనటువంటి నాగలితో దున్నే వ్యవసాయదారులు. నల్లమలై అరణ్యములోను, అమరాబాద్ పీఠభూమిలోను-ఉన్నటువంటి చెంచు తెగవారు ముఖ్యముగా అరణ్యమృగములను వేటాడి, అరణ్యములలో దొరకు ఆహార పదార్థములు, కాయలు, దుంపలు, పండ్లు, ఆకులు మొదలగునవి సేకరించి జీవించెదరు. ఆదిలాబాద్ జిల్లాలో గోండ్లతోపాటు నివసించుచున్న ప్రధానులు, తోటీలు ముఖ్యముగా గోండు ప్రభువుల కొలువులలో వివాహాది శుభ కార్యములు, కర్మ కాండల సందర్భములలో వంశపారంపర్యముగా పాటలు పాడుచు గోండు దొరలిచ్చు పారితోషికముతో భృతి వెళ్ళబుచ్చుచుండిరి. వంశపారంపర్యముగా పశువులను పెంచుచు జీవనముచేసే గౌడులు, సుగాలీలు యిప్పుడిప్పుడు నాగలి వ్యవసాయముకూడ చేయుచున్నారు. మనరాష్ట్రములో ఉన్న ఆదివాసులు, జొన్న, మొక్కజొన్న, రాగులు, మినుములు, కందులు, ఉలవలు, నువ్వులు మొదలగు పంటలు పండించుచున్నారు. పాలకొండ, శృంగవరపుకోట ప్రాంతములలో వీరు అరటి తోటలను ముమ్మరంగా పెంచుతున్నారు అరకు లోయలో ఉన్న గిరిజనులు కమలాఫల తోటలను విరివిగా పెంచెదరు.

మనరాష్ట్రములో ఉన్న ఆదిమవాసులు వ్యవసాయము ముఖ్యవృత్తిగా పరిగణించి వ్యవసాయపు కూలీపని, అడవులలో కూలిపని మరియు చిన్నతరహా అటవీ సంపదను ప్రోగుచేసి జీవనము సాగించుచున్నారు. అభివృద్ధి మండలముల ద్వారా ప్రభుత్వమువారు కట్టుచున్న భవనములు, వంతెనలు, రోడ్లు మొదలగు నిర్మాణాత్మకమైన పనులలో కూడ గిరిజనులు పాల్గొనుచు తద్వారవచ్చు ఆదాయంతో జీవనము గడుపుచున్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు పశ్చిమ గోదావరి, ఖమ్మం, వరంగల్లు జిల్లాలలో ఉన్న ఆదిమవాసులు అరణ్యప్రాంతములలో దొరకు చింతపండు, కరక్కాయలు, షీకాయ, చీపుళ్ళు, కుంకుడు కాయలు, అడ్డ ఆకులు, తేనె మొదలగు చిన్నతరహా అటవీసంపదను ప్రోగుచేసి

గిరిజనులకొరకై ప్రత్యేకముగా స్థాపించబడిన గిరిజన సహకార కార్పోరేషన్‌కు అమ్ముచున్నారు. ఈ అటవీసంపదలో ముషిణి, గంటుబారంకి, కానుగ, పాతాల గరిడి మొదలగు ఔషధులు ముఖ్యమైనవి.

గిరిజన తెగలలో కొంతమందికి వ్యవసాయము ముఖ్యవృత్తిగా యున్నను యితర వృత్తులలో కూడ ప్రావీణ్యత సంపాదించుచున్నారు. మన రాష్ట్రములో ఉన్న చెంచువాండ్లు తేనె ప్రోగుచేయుటలోను, వెదురు నరుకుటలోను ప్రవీణులు. వీరికి చేపలు పట్టుటలో కూడ ప్రావీణ్యత ఉన్నది. కమ్మర తెగకు చెందిన ఆదివాసులు పురాతన పద్ధతిలో వ్యవసాయపు ఇనుప పనిముట్లు తయారు చేయుదురు. విశాఖపట్నం జిల్లాలో ఉన్న జాతపులు చాపలు అల్లుటలోను, బుట్టలు అల్లుటలోను, నూనె తీయుటలోను ప్రావీణ్యత కలిగి ఉన్నారు. నాయకపోండ్లకు చెట్లు పడగొట్టుటలోను, కలప సాఫీగా చేయుటలోను అనుభవము కలదు. వీరికి వడ్రంగము, కమ్మరము, బుట్టలుఅల్లుట మొదలగు పనులలో కూడ అనుభవము కలదు. కోస్తాజిల్లాలలో వున్న సుగాలీలు ఎక్కువగా కూలీ పనిచేయుచు పల్లెలలో ఉప్పు అమ్మెదరు. వీరు గోనె సంచులు బాగుచేయుటలోను, గోగునారతో త్రాళ్ళు తయారుచేయుటలోను నేర్పరులు. ఏజన్సీ ప్రాంతములలో నివసించుచున్న వాల్మీకులు, చిన్నతరహా అటవీ ఫలసాయములో వ్యాపారము చేయుదురు. మైదాన ప్రాంతములలో ఉన్న ఏనాదులు చేపలు పట్టుటలో సిద్ధహస్తులు. ఏనాది తెగకు చెందిన ఆడవారు గిరిజనేతరుల యిండ్లలో వడ్లు దంచుట, వంటసామాన్లు తోముట మొదలగు పనులు ఎక్కువగా చేయుదురు. ఏనాదులు పంటచేలలో ఎలుకలనుకూడ పట్టుదురు. నెల్లూరు ప్రాంతంలో ఏనాదులు రంగు రంగుల చాపలల్లుటలో ప్రవీణులు. ఎరుకల తెగకు చెందిన ఆడవారు 'సోది' చెప్పుటకు ప్రసిద్ధులు. ఎరుకల వారి ముఖ్య జీవనాధారము పందుల పెంపకమని జగద్విదితము.

ఈ రోజులలో గిరిజనులు వారి వంశపారంపర్యముగా వచ్చిన వృత్తులే గాకుండా, తమ నిర్మాణాత్మకమైన పనులలోను, గవర్నమెంటు ఉద్యోగములలోను, రవాణా సౌకర్యములలోను, వ్యాపారానికి సంబంధించిన వృత్తులలోకూడ పాల్గొనుచున్నారు.

విభిన్న సంస్కృతులు, విలక్షణమైన ఆర్థిక సాంఘిక వ్యవస్థలుగల 33 అనుసూచిత తెగలు మనరాష్ట్రములో ఉన్నారు. ఆదిమవాసులయొక్క జీవనవిధానమే విలక్షణమైనది. వారి వ్యక్తిగత దినచర్య మొదలు ఆహార సంపాదన, వివాహములు, వినోదములు, విశ్వాసములు, ఆచారవ్యవహారములు మొదలగు ప్రతి సూక్ష్మజీవితాంశంకూడ వేరు వేరు రీతులలో ఉండును. ఒక ప్రాంతపు ఆదివాసునికి మరో ప్రాంతపువానికికూడ ఆచారవ్యవహారములలో ఈ విభేదాలు ఉన్నవి.

ఆదిమవాసులకు మూఢనమ్మకములు ఎక్కువ. వీరు దేవతలను, ప్రకృతి శక్తులను, పలువిధములైన ప్రేతాత్మలను ఎక్కువగా ఆరాధింతురు. వీరి వ్యవసాయపుపనులు తదితర ఆర్థిక వ్యాసంగములు పూజాపునస్కారములతోను, పండుగలతోను ముడివడి ఉన్నవి. వారి సాంఘిక, మత, రాజకీయ వ్యవస్థ అనూచానంగా

వస్తున్న గిరిజన పంచాయితీలపై ఆధారపడి ఉన్నది. గిరిజన గ్రామము యొక్క పెద్ద వీరియొక్క సాంఘిక వ్యవస్థను తీర్చిదిద్దుతాడు.

మన రాష్ట్రప్రభుత్వము ఆదిమవాసులను నిద్రాణస్థితినుండి మేల్కొల్పుటకు పూనుకొంది. పంచవర్ష ప్రణాళికలద్వారా అనేకమైన అభివృద్ధి పథకములను ప్రవేశ పెట్టినది అనుసూచిత ప్రాంతములలోకూడ పంచాయితీ రాజ్యమును ప్రవేశపెట్టిరి. అనుసూచిత ప్రాంతములోని గిరిజన పంచాయితీ సమితులలో ప్రెసిడెంటు, వైస్ ప్రెసిడెంటు పదవులను గిరిజనులకే ప్రత్యేకించిరి. గిరిజనుల బహుముఖాభివృద్ధికై శ్రద్ధవహించుటకు ప్రత్యేకముగా గిరిజన సంక్షేమశాఖను ఏర్పరచిరి. విద్య, వృత్తి పాఠశాలలలోను, ఉద్యోగరంగములోను వీరికి కొన్ని స్థానములు ప్రత్యేకించిరి. గిరిజనప్రాంతములలో అనేక పాఠశాలలను ఉచితవసతి గృహములను స్థాపించుటయే గాక, ఉపకార వేతనములనుకూడ ప్రభుత్వము యిచ్చుచున్నది. రాజకీయముగా రాష్ట్ర విధానసభ, లోక్ సభలలోకూడ వీరికి ప్రత్యేక స్థానములు కేటాయించిరి. వీరి అభివృద్ధికై ప్రత్యేకనిధులు ఏర్పాటుచేసి ఆదివాసి అభివృద్ధి మండలములద్వారా ప్రభుత్వము కృషిచేయుచున్నది.

తరతరాలుగా షావుకార్లు, వడ్డీ వ్యాపారస్తులు ఆదివాసులకు చేస్తున్న అన్యాయములను అరికట్టుటకై ప్రభుత్వము ప్రత్యేక చట్టములను అమలుపరచినది. వానిలో ఆంధ్ర ప్రదేశ మన్యప్రాంత ఋణదాస్యనివృత్తి శాసనము 1940, ఆంధ్ర ప్రదేశ మన్యప్రజల ఋణ విముక్తి నిబంధన 1960, ఆంధ్రప్రదేశ మన్యప్రాంతములలోని వడ్డీవ్యాపారస్తుల నిబంధన 1960 ముఖ్యమైనవి. అమాయకులైన ఆదివాసులనుండి సారవంతమైన భూమి అన్యాక్రాంతము కాకుండా ప్రభుత్వము ఆంధ్ర ప్రదేశ్ లోని మన్యప్రాంతములలోని గిరిజనుల భూమిని గిరిజనేతరుల హస్తగతము చేయుటను నిషేధించుచు 1959 సంవత్సరములో నిబంధనావళిని అమలుపరచిరి.

ఈవిధంగా వెనుకబడిన ఆదిమవాసులకు రాజకీయ, సాంఘిక, ఆర్థిక, ఉద్యోగ రక్షణలను కల్పించుటయేగాక, వారి శీఘ్ర పురోగతికి బహుముఖముల అవిరళ కృషిచేయుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము కంకణము కట్టుకున్నది.

## Information to our Contributors

The Bulletin, in addition to the publication of the Research work of the Tribal Cultural Research and Training Institute, Hyderabad also publishes the original articles and papers from those who are interested in the various aspects of tribal life. Papers and articles narrating the various problems of the tribals and their way of life etc., are therefore, cordially invited for publication both in English and Telugu.

The contributors are requested to send manuscripts in duplicate. The manuscripts should be typed, double spaced on one side only. Footnote should also be double spaced. All papers should be numbered in the upper right hand corner of the page. Each manuscript should be accompanied by a declaration that the material has not been published elsewhere and that it was not submitted for publication in any other journal.

The Editorial Board is not responsible for the views expressed in the articles and papers included in the Bulletin. It reserves right to accept or reject publication of any manuscript received.

The Bulletin is bi-annual and will be made available to the subscribers in January and June every year. All correspondence and articles shall be addressed to the Director, Tribal Cultural Research and Training Institute, Banjara Hills, Hyderabad-34 (A.P.).

TRIBAL CULTURAL RESEARCH AND TRAINING INSTITUTE
HYDERABAD - A. P.

PRINTED AT THE A. P. TEXT-BOOK PRESS, HYDERABAD - A.P.